


ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు 'కడలి'

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఈ నెల 9,10 తేదీల్లో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో 48 గంటల పాటు నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్స వాలకు విశ్రాంత ఉపాధ్యా యులు, కవి కడలి ప్రకాశరా వుకు ఆహ్వానం అందింది. రెండు రోజులు పాటు ఐఎస్ఒ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వేడుకల్లో పాల్గొని కవితా గానం చేయాలని ఆయనకు పంపిన ఆహ్వాన పత్రికలో పేర్కొన్నారు. దీంతో ప్రకాశరావును పలువురు అభినందిస్తున్నారు.



సిఎస్ఆర్ నిధులతో..
డిజిటల్ క్లాస్ రూమ్‌లు

ఉదారంగా సహకరించిన భారత్ డైనమిక్ లిమిటెడ్



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాకు మంజూరైన సిఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో స్కిల్‌డెవలప్‌మెంట్, డిజిటల్ క్లాస్ రూముల నిర్మాణం చేపడుతున్నారు. వెనుకబడిన జిల్లాల సరసన విజయనగరం ఉన్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో (భారత్ డైనమిక్ లిమిటెడ్) బిడిఎల్ నుంచి గత ఏడాది సోషల్ రెస్పాన్స్‌బిలిటీ నిధులు రూ.5.4కోట్లు ఇచ్చింది. ఇందులో ఇప్పటికే సగం నిధులు ఖర్చుచేసినట్టు సమాచారం. వీటిలో రూ.3కోట్లను జిల్లాలో డిజిటల్ క్లాస్‌రూంల ఏర్పాటుకు కేటాయించారు. మిగిలిన రూ.2.4 కోట్లను స్కిల్ డెవలప్‌మెంట్‌కు కేటాయించారు. డిజిటల్ క్లాస్‌రూములకు సంబంధించి డిసిఎంఎస్ ద్వారా కంప్యూటర్లు, ప్రొజక్టర్స్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేశారు. విద్యాశాఖ సాంకేతిక సహకారం అందించింది. ఇప్పటికే రూ.2.8కోట్లు విడుదల చేసినట్టు సమాచారం. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహణ బాధ్యత డిఆర్‌డిఎకు అప్పగించారు. ఈ శిక్షణ తరగతులు మహిళా ప్రాంగణంలో జరుగుతున్నాయి. దీనికి సంబంధించి రూ.1.2కోట్లు ఇప్పటి వరకు ఖర్చుచేసినట్టుగా తెలుస్తోంది. పూసపాటిరేగలోని మైలాన్ కంపెనీ కూడా స్థానిక గురుకుల పాఠశాల అభివృద్ధికి ఇటీవల రూ.1.5కోట్లు కేటాయించింది. ఈ నిధులను డార్మెటరీ తదితరాలకు ఖర్చు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ కంపెనీల నుంచి సోషల్ రెస్పాన్సుబిలిటీ నిధులు విరివిరిగా మంజూరవు తున్నాయి. వీటిని సకాలంలో పథకం ప్రకారం సద్వినియోగం చేసుకుంటే జిల్లాలో చాలా వరకు మౌలిక సదుపాయాలు మెరుగుపర్చు కునేందుకు అవకాశం ఉంటుందని పలువురు వ్యాఖ్యాని స్తున్నారు. రాష్ట్ర విభజనలో భాగంగా మన జిల్లాకు ఏటా రూ.50కోట్లు చొప్పున ఐదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సివున్నప్పటికీ రెండేళ్ల మాత్రమే నిధులు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో పాలకులు ఎలాగూ ప్రశ్నించలేదు. దీంతో, మిగిలిన నిధులు రాలేదు. కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి మరింత బరితెగించింది. ఏటా రూ.5కోట్ల చొప్పున ఎంపీ నిధులు కేటాయించాల్సి వుండగా 2019-20లో రూ.5కోట్లు, కరోనా కష్టాలపేరిట 2020-21లో రూ.2కోట్లు మాత్రమే కేటాయించింది. అనంతరం నిధులు కేటాయించ లేదు. ఇంతకు ముందు మాదిరిగా ఎమ్మెల్యేలకూ నిధుల కేటాయింపు లేవు. ఇటువంటి పరిస్థితుల్లో సిఎస్ఆర్ నిధులు జిల్లాకు ఎంతో ఉపయోగ పడతాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



యువతకు కిట్లను అందజేస్తున్న ఎస్‌పి దీపిక

ఎస్‌పి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి ఎం. దీపికా పాటిల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ క్రైమ్, లోన్ యాప్స్ మీద మహిళా పోలీసులు గ్రామాల్లో చేసిన ప్రచారం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నేరాలు జరగకుండా మరింత కృషి చేయాలని సూచించారు. స్టేషను ప్రాంగణాన్ని పరిశీలించి, రికార్డులు, సిడి ఫైల్స్ తనిఖీ చేశారు. అనంతరం, పోలీసు సిబ్బంది, మహిళా సంరక్షణ పోలీసులతో ఆమె మమేకమై, వారి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. దేశపాత్రునిపాలెం గ్రామ యువతకు కమ్యూనిటీ పోలీసింగులో భాగంగా వాలీబాల్, క్రికెట్ కిట్స్ పంపిణీ చేశారు. ప్రజలతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని, స్టేషన్‌కు వచ్చిన బాధితుల సమస్యలు సావధానంగా విని, వారికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, న్యాయ స్థానాలు నుండి త్వరితగతిన సీసీ నెంబర్లను పొందాలని అధికారులను ఆదేశించారు. స్పందనలో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తవలస సిఐ ఎస్. బాల సూర్యారావు, ఎస్ఐలు బి. దేవి, వెంకటేశ్వర రావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్ పోస్టు
రూ.8.20 లక్షలకు వేలం

- దరఖాస్తు చేసినందుకు వెలివేస్తామంటూ బెదిరింపులు
- కలెక్టర్‌కు వికలాంగ మహిళ ఫిర్యాదు
- న్యాయం చేయాలంటూ వేడుకోలు



కలెక్టర్ఇచ్చిన ఫిర్యాదును చూపుతున్న లక్ష్మి

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మండలంలోని రెల్లి పంచాయతీ పరిధిలోగల ముమ్మనవాని పాలెంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ పోస్టు భర్తీ చేసేందుకు ప్రభుత్వం తాజాగా నోటిఫికెషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో గ్రామంలోని పెత్తందారులు గ్రామాభివృద్ధి పేరుతో ఈ పోస్టును బహిరంగ వేలం వేయడంతో జిల్లాలో చర్చనీయాంశమైంది. అన్ని అర్హతలూ ఉన్న గ్రామానికి చెందిన వికలాంగ మహిళ గంగాధర లక్ష్మి తనకు ఆ పోస్టు ఇప్పించాలని గ్రామ పెద్దలను వేడుకుంది. అయినా పట్టించుకోకుండా అందరి సమక్షంలో రూ.8.20 లక్షలకు వేలం వేయడంతో మరో మహిళ ఆ పోస్టును కైవసం చేసుకుంది. దీంతో గంగాధర లక్ష్మి వేలం పాటను వ్యతిరేకించి టీచర్ పోస్టుకు దరఖాస్తు చేసుకుంది. గ్రామ కట్టుబాటుకు వ్యతిరేకంగా దరఖాస్తు చేస్తావా అంటూ గ్రామంలోని కొందరు పెద్దలు గ్రామం నుంచి వెలి వేస్తామాంటూ బెదిరింపులకు పాల్పడి బహిరంగ ప్రచారం చేశారని లక్ష్మి జిల్లా కలెక్టర్ సూర్యకుమారికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తనకు అన్ని అర్హతలూ ఉన్నాయని, నిరుపేదరాలైన తనకు ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని అధికారులను వేడుకుంటోంది. గురువారం కొత్తవలస ఐసిడిఎస్ కార్యాలయంలో ఈ పోస్టు భర్తీకి ఇంటర్వ్యూ జరగనుంది. అయితే అధికారులు ఇంటర్వ్యూను పారదర్శకంగా జరిపి అర్హులకు న్యాయం చేయాలని పలు ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

7 నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'

- ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 7 నుంచి 20 వరకు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి వెల్లడించారు. ఈ నాలుగేళ్ల పాలనలో తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి.. వారి అభిప్రాయాలను తెలుసు కుంటామని చెప్పారు. ప్రజలకు ఇంకేమైనా అవసరాలను తీర్చాల్సి ఉందా? అన్న విషయాలను కూడా గుర్తిస్తామని తెలిపారు. బుధవారం తనన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లోనూ 14 రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ తరపున నియమితులైన గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లు ఇందులో భాగస్వామ్యం అవుతారని వివరించారు. గత ప్రభుత్వాలకు, ఈ ప్రభుత్వానికి ఉన్న తేడా ప్రజలకు వివరిస్తామని తెలిపారు. పేద ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, ఇతర కనీస అవసరాలు తీర్చేందుకు ఏ ప్రభుత్వమైనా సంక్షేమ పథకాల కోసం కొంత మొత్తాన్ని వెచ్చిస్తుందని చెప్పారు. ఆనాడు వైఎస్, చంద్రబాబు హయంలోనూ ఇవి జరిగాయని, జగన్ ప్రభుత్వం ఒక్కటే కొత్తగా పెట్టినదేమీ కాదని తెలిపారు. నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలకు తమ ప్రభుత్వం ప్రాధాన్య మిస్తుందన్నారు. ప్రభుత్వంపై పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకే టిడిపి నాయకులు.. రాష్ట్రం దివాలా తీస్తోందని దుష్ప్రచారాలు చేస్తూ, ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన



హామీలన్నీ అమలు చేస్తున్నామని తెలిపారు.

ఒంటరిగా పోటీ చేయలేకే పొత్తుల కోసం తాపత్రయం

ఒంటరిగా ఎన్నికలకు వెళ్లలేక పొత్తుల కోసం చంద్రబాబునాయుడు తాపత్రయ పడుతున్నారని విమర్శించారు. ఎవరు కలిసినా జగన్‌ను ఓడించలేరన్న భయంతోనే తమ అనుకూల మీడియాను అడ్డం పెట్టుకొని ప్రభుత్వంపై దుష్ప్రచారానికి దిగుతున్నారని దుయ్యబట్టారు.

నేడు 'దండి మార్చ్' విగ్రహావిష్కరణ

నగర సుందరీకరణలో భాగంగా విజయనగరంలోని ఐస్ ఫ్యాక్టరీ కూడలి వద్ద ఉప్పు సత్యాగ్రహం సందర్భాన్ని గుర్తు చేస్తూ.. ఏర్పాటుచేసిన దండి మార్చ్ విగ్రహాలను గురువారం ఆవిష్కరించనట్లు కోలగట్ల తెలిపారు. ఉదయం 11 గంటలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా జరగనున్న ఈ కార్యక్రమానికి ప్రజలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.

మహనీయుల బాటలో పయనిద్దాం

బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

నేటి తరం యువత, విద్యార్థులు మహనీయుల జీవిత విశేషాలను తెలుసుకొని వారి బాటలో నడిచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కలెక్టర్ ఎ. సూర్యకుమారి అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలను కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ రఘురాజు, డిఆర్ఒ గణపతిరావు, ఇతర జిల్లా స్థాయి అధికారులతో కలిసి ఆమె బాబూ జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుల జీవిత పాఠాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, వారి మాదిరిగా సమాజానికి సేవ చేయాలని హితవు పలికారు. చదువు అనే మార్గాన్ని అనుసరించి ఆయన ఎన్నో పోరాటాలు చేశారని, స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటి చెప్పారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకొని గొప్ప స్థాయికి ఎదగాలని హితవు పలికారు.

చదువే అసలైన ఆయుధం

జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నా.. సామాజిక చైతన్యం తీసుకురావాలన్నా చదువే అసలైన ఆయుధమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఆయన బాటలో నడిచి నేటి తరం యువత, సంఘాల నాయకులు సమాజానికి మరింత సేవ చేయాలని హితవు పలికారు. జిల్లా కేంద్రంలో ఎక్కడా కూడా బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం లేదని ప్రభుత్వం వారు స్థలం కేటాయిస్తే ఆ మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. డిఆర్ఒ ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్, మెప్మా పీడీ సుధాకర్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి రత్నం, ఆ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్య డిగ్రీ కళాశాలలో..

సత్యా కళాశాలలో జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి నివాళు లర్పించారు. ఆయన దేశానికి ఎంతో సేవనందించారని, అటువంటి మహనీయులను స్ఫూర్తిగా విద్యార్థులందరూ తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి ఆకాంక్షించారు.





జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి; కార్పొరేషన్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మేయర్ తదితరులు

కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భావితరాలకు స్ఫూర్తి దాయకం

విజయనగరం టౌన్ : సంఘ సంస్కర్త, ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలు భావితరాలకు ఆదర్శప్రాయమని మేయర్ విజయలక్ష్మి అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, కార్పొరేషన్ మేనేజర్ ప్రసాదరావు, రోజా రాణి, భారతి తదితరులు పాల్గొన్నారు.

జగజ్జీవన్ రామ్ అశయ సాధణకు కృషి చేద్దాం : కెవిపిఎస్

జగ్జీవన్ రామ్ ఆశయాల కోసం కృషి చేద్దామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ అన్నారు. స్థానిక బొగ్గులదిబ్బ వద్ద జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ జగజ్జీవన్ రామ్ పార్లమెంటు సభ్యుడిగా, కేంద్రమంత్రిగా, దేశ ఉప ప్రధానిగా పనిచేసి దళితుల సంక్షేమం కోసం, వారి హక్కుల కోసం, దళితుల అభ్యున్నత కోసం కృషి చేశారని కొనియాడారు. ఆయన దళితుల అభ్యున్నతి కోసం కృషి చేస్తే, ఇప్పుడున్న దళిత ప్రజాప్రతినిధులు దళితులను నట్టేటా ముంచేందుకు అధికార పార్టీలతో చేతులు కలుపుతున్నారని ఆరోపించారు. హక్కుల పైన, దళితుల సంక్షేమ పథకాల పైన జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడి ఆయన ఆశయాల సాధన కోసం కషి చేద్దామని పిలుపునిచ్చారు.

డిబిఎస్‌యు ఆధ్వర్యాన...

డిబిఎస్‌యు ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు మాట్లాడుతూ పీడిత వర్గాల ఆశాజ్యోతి బాబు జగజ్జీవన్ రామ్ అని కొనియాడారు. భూ సంస్కరణలు తేవడంలో, పాకిస్థాన్ తో జరిగే యుద్ధములో ప్రదర్శించిన తెగువ ఆయన దేశభక్తి కి నిదర్శనమని అన్నారు. ఎస్ఐ ఎస్.రాజు మాట్లాడుతూ జాతీయ నాయకులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యమంలో ఇండస్ట్రీయల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షులు జొన్నాడ చిన్నారావు, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ ఉపాధ్యక్షుడు గండి రవి, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా సంయుక్త కార్యదర్శి ఎమ్ సూర్య చంద్ర, పంచాయతీ సర్పంచ్ బోనెల విజయబాబు, రాయి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని ఎంఆర్‌పిఎస్, ఎంఐఎఫ్ ఆధ్వర్యాన అంబేద్కర్ భవనంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి హాజరైన ఎంఐఎఫ్ జిల్లా అధ్యక్షులు పెంకి ఇజ్రాయిల్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు అరసాడ రవికుమార్ మాట్లాడుతూ జగజ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. జిల్లా అధ్యక్షులు బోగి శ్రీను, బుంగ భానుమూర్తి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలి

- జెఎన్‌టియు విసి వెంకటసుబ్బయ్య
- 'సీతం'లో హ్యాక్‌థాన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

విభిన్నమైన ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలని విద్యార్థులకు జెఎన్‌టియు గురజాడ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాల, ప్రముఖ వెబ్ డెవలప్‌మెంట్ కంపెనీ 'బ్రెయిన్ ఓ విజన్ సొల్యూషన్స్' సంయుక్తంగా హ్యాక్‌థాన్ కార్యక్రమాన్ని బుధవారం అట్టహాసంగా ప్రారంభించాయి. కళాశాలలో ప్రతి సంవత్సరం జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం, టెస్లా ఇన్నొవేషన్ ప్రాజెక్ట్ పోటీలు జరుగుతున్నాయి. అందులో భాగంగా జె ఎన్‌టియు గురజాడ విసి డాక్టర్ వెంకటసుబ్బయ్య, సత్య విద్య సంస్థల కరెస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝూన్సీ లక్ష్మీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కీమా టెక్ సిఇఒ నాయుడు సుంకరి, బ్రెయిన్ ఓ విజన్ సిఇఒ గణేష్ నాగ్ తదితరులు పాల్గొని విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలు చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎమ్. శశిభూషణ్ రావు మాట్లాడుతూ వివిధ జిల్లా ల నుంచి పాల్గొనే విద్యార్థుల మధ్య విన్నూత్న ఆలోచనలు, చురుకైన సృజనాత్మక చర్చలు, సమకాలీన ఆలోచనలు విద్యార్థులలో తీసుకురావాలని ఆకాంక్షించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు వెయ్యి మందికి పైగా యువ ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరుస్తారని, ఇది విద్యార్థులలో



హ్యాక్‌థాన్ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న విసి, తదితరులు

నూతన ఉత్సాహం ఇస్తుందని అయన పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి మాట్లాడుతూ యువ ఇంజనీర్లలో ఉత్సాహం, ఆవిష్కరణల కోసం ఈ కార్యక్రమం దోహద పతుందన్నారు. కార్యక్రమానికి కన్వీనర్‌గా సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ జి.వేణు మాధవ రావు వ్యవహరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెల్లూరు వద్ద స్టాపర్లు ఏర్పాటు

విజయనగరం రూరల్ : రూరల్ పోలీసు స్టేషను పరిధిలో చెల్లూరు జాతీయ రహదారి వద్ద బుధవారం స్టాపర్లు ఏర్పాటు చేశారు. రహదారి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు రూరల్ సిఐ టివి తిరుపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - రహదారి భద్రతలో భాగంగా వాహనాల వేగం నియంత్రించి, ప్రమాదాల జరగకుండా స్టాపర్లు ఉపయోగ పడతాయన్నారు. వాహన చోధకులు రహదారి నియమాలను పాటించాలని, ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని హెల్మెట్‌లు, సీట్ బెల్ట్ లు తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఎస్ఐ గణేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంత్రి బొత్స పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం 9.45 గంటలకు ద్వారపూడిలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభిస్తారు. 11.30 గంటలకు ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద దండి సత్యాగ్రహం విగ్రహాలను ఆవిష్కరిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి విశాఖ మీదుగా సాయంత్రానికి విజయవాడ చేరుకుంటారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు బుధవారం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు వినతి అందజేశారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం భవనం శిథిలావస్థకు చేరుకుందని, కొత్త భవనం మంజూరు చేయాలని,ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందించిన ఆయన పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు ముమ్వల గంగా ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి పి.చంద్రశేఖర్ రాజు, తాలూకా అధ్యక్షులు ఎం.మంగరాజు, కార్యదర్శి గంగి రమేష్, పట్టణ కోశాధికారి జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కాళికామాత ఆలయానికి విరాళం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దాసన్నపేట రింగ్ రోడ్ లో గల శ్రీ కాళికా మాత ఆలయానికి వైసిపి నాయకులు పిల్లా విజయకుమార్ బుధవారం లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఆలయ పెద్దలు, కమిటీ సభ్యులు అభ్యర్ధన మేరకు విజయ్ కుమార్ ఆలయాన్ని సందర్శించి ఆలయ అభివృద్ధికి విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో వెంకట లీలప్రసాద్, సాధునపల్లి వెంకట్ రావు, ప్రభాస్ శ్రీను , పంతులు శ్రీను ,లక్ష్మణ్ రావు, ఆలయ పూజారి ఆదిత్య పాల్గొన్నారు.



ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఇ నాగేశ్వరరావు

విద్యుత్తు ఉద్యోగుల గెట్ టు గెదర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్‌శాఖలో 1993లో నియామకమైన ఐటిఐ బ్యాచ్ ఉద్యోగులు 30ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్‌విఎన్ లేక్ ప్యాలెస్‌లో కుటుంబాలతో సహా బుధవారం కలుసుకున్నారు. ముఖ్య అతిథులుగా టాన్స్‌కో ఎస్ఇ పి.నాగేశ్వరరావు, డిఇఇ ఎన్.కృష్ణమూర్తి, హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ 30ఏళ్ల క్రితం విధుల్లో చేరిన ఉద్యోగులంతా కుటుంబాలతో సహా ఒక చోటు కలుసుకోవడం అభినందనీయమన్నారు. పిల్లల చదువులు, వారి అభివృద్ధి గురించి చెబుతున్నప్పుడు గర్వంగా ఉందన్నారు. ఆరోగ్యంగా ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగులంతా కృషి చేయాలని కోరారు. డిఇఇ కృష్ణమూర్తి మాట్లాడుతూ నేడు మానవ సంబంధాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయన్నారు. ఉద్యోగాలు సక్రమంగా చేయాలంటే కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉందన్నారు. ఇంటి బాధ్యతనంత ఫ్యామిలీ సభ్యులు నిర్వహించి మనం, మన పిల్లలు అభివృద్ధి పథంలో నడుస్తున్నామంటే అది విద్యుత్ శాఖ యాజమాన్యం సహాయ సహకారాల వల్ల సాధ్యమవుతుందని తెలిపారు. ఎన్ని పని ఒత్తిడిలో ఉన్న కుటుంబం, మానవ సంబంధాలు కొనసాగిస్తూనే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఉద్యోగులందరిని కోరారు. కార్యక్రమంలో విజయనగరం టౌన్ ఎడిఇ ఎల్ సత్యనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఎస్.లక్ష్మణ, ఎస్.మురళి, కెవివి సత్యనారాయణ, పివి రవికుమార్, ఎంవిఎ సూర్యనారాయణ, జి.రామారావు, ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపిపి దొగ్గ సత్యవంతుడు

శ్మశానవాటిక రోడ్డు పనులు ప్రారంభం

వేపాడ: మండలంలోని కేజీపూడి గిరిజన గ్రామ శ్మశాన వాటికకు వెళ్లే రహదారి పనులను ఎట్టకేలకు బుధవారం ప్రారంభించారు. ఈ పనులను మండల పరిషత్ నిధుల నుంచి చేపడుతున్నట్లు ఎంపిపి దొగ్గ సత్యవంతుడు తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రోడ్డుకు రూ. 10లక్షలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. విజయ రామసాగర్‌కు వెళ్లే గడ్డకు వంతెన నిర్మాణానికి కూడా నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంగారయ్య, ఎంపిటిసి ముత్యాలమ్మ, జిల్లా రైతు సంఘం నాయకుడు చల్లా జగన్, వైసిపి మండల అధ్యక్షుడు జగ్గారావు, జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

రేగిడి : మండలంలోని పెద్దశిర్లాం గ్రామంలో రూ.70 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రం, నాడు నేడు పాఠశాల భవనాల నిర్మాణాలను డిఇ జయప్రకాష్ బుధవారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీరాజ్ జెఇ రామకృష్ణారావుకు సూచించారు. గడువులోగా పూర్తిచేసి అన్ని హంగులతో అందజేయాలని సూచించారు. నిబంధనలు ప్రాప్తికి పనులు చేపట్టాలన్నారు. స్థానిక వైసిపి నాయకులు లెంక రాంబాబు, నాడు నేడు జెఇ దాలయ్య ఆయనతో పాటు ఉన్నారు.


రమేష్‌ను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

ఉపాధ్యాయునికి సన్మానం

బాడంగి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న డాకేటి రమేష్‌ను బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఆయన విద్యార్థులకు డిజిటల్ శిక్షణ ఇవ్వటంలోనూ, బైజూస్ ట్యాబుల వినియోగంలో విశేష సేవలకు గాను ఈ సత్కారం చేశారు. పాఠశాలకు 10ఫ్యాన్లు వితరణ చేయడంతో పాటు 8వ తరగతి విద్యార్థులు జాతీయ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపిక కావటంలో ఆయన ప్రధాన భూమిక పోషించారు. కాగా విద్యార్థుల తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లివిద్యార్థుల విద్యా స్థాయిని వారికి వివరించి అవగాహన కల్పించటం వంటి సేవలకు పేరెంట్స్ కమిటీ చైర్మన్ లచ్చుపతుల శేషగిరి, ప్రధానోపాధ్యాలు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉపాధి' పని ప్రదేశాల్లో టెంట్లు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



టెంట్ల నీడలో సేద తీరుతున్న కూలీలు

జామి : 'గ్రామీణ ఉపాధిహామీ పని ప్రదేశాల్లో టెంట్లు దర్శనమివ్వాలి. ఎట్టకేలకు డ్వామా అధికారులు స్పందించారు. గొంతెండుతోంది.. భూమి కాడనంటోంది' అనే శీర్షికన బుధవారం ప్రజాశక్తి లో వార్తా కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి, మండలంలోని అన్ని ఉపాధి పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు పనులు చేస్తున్న ప్రాంతాల్లో టెంట్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు ఎపిఒ శేఖర్ తెలిపారు. తాగునీరు ఎవరికి వారే ఏర్పాటు చేసుకున్నట్లు కూలీలు చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వేసవిని దృష్టిలో పెట్టుకొని కొత్త టెంట్లు, అలవెన్సులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

పెట్టుబడులపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీరంగాచార్యులు

నెల్లిమర్ల : మనం ఏ రంగంలోనైనా పెట్టుబడులు పెట్టేటపుడు నిర్ణయాలు ఎలా తీసుకోవాలనే అంశంపై విశాఖకు చెందిన ఐఐఎం అసోసియేట్ ప్రొఫెసర్ బి.శ్రీరంగాచార్యులు వివరించారు. బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన 'డెసిషన్ మేకింగ్ విత్ స్ప్రెడ్ షీట్స్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తక్కువ పెట్టుబడులు పెట్టి ఎక్కువ లాభాలు ఆర్జించాలనుకుంటారని అందుకు అనుసరించాల్సిన పద్ధతుల గురించి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ఆయనను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, విభాగాధిపతి డాక్టర్ ఎ.శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.సోమశేఖర్, పలువురు బిబిఎ విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బేబినాయన, తెంటు రాజా

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బాడంగి: ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా అన్నారు. మండలంలోని గూడెపువలస పంచాయతీ రావివలసలో వంగపండు త్రినాధ్ నాయుడు ఆధ్వర్యంలో 40 కుటుంబాలు టిడిపిలో చేరారు. ప్రభుత్వం నుంచి ప్రతి నెలా గౌరవ వేతనం పొందుతున్న వాలంటీర్లను అధికార పార్టీ ప్రచార కార్యక్రమంలో మమేకం చేయాలంటూ సీఎం జగన్ చెప్పడం వివాదానికి మూలమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, వైస్ ఎంపిపి భాస్కర్ రావు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

బాడంగి : మండలంలోని అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎఎస్ఐ కొండలరావు హెచ్చరించారు. బుధవారం ముగడ గ్రామంలో అక్రమంగా ట్రాక్టర్‌తో ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తిని ఆయన పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులూ లేకుండా ఇసుకను ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. అనంతరం ఆయన పై కేసు నమోదు చేశారు. ఇసుక తరలిస్తే ఎవరైనా పోలీసులకు సమచారం ఇవ్వొచ్చని చెప్పారు.

పనులే పూర్తి కాలేదు కానీ...

ఫర్నీచర్ వచ్చిందోచ్..!

- ఐదేళ్లు గడిచినా పూర్తికాని తహశీల్దార్ కార్యాలయ భవనం
- గడువు ముగిసినా ముందుకు కదలని పనులు
- కార్యకలాపాలకు ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- రేగిడి

మండల తహశీల్దార్ నూతన కార్యాలయం పూర్తి చేసేది ఎప్పుడని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పాత కార్యాలయం పూర్తిగా శిథిల వ్యవస్థలో ఉంది. ఈ కారణంగా 2018 ఏప్రిల్ 22న టిడిపి హయాంలో జిల్లా కలెక్టర్ ధనంజయ రెడ్డి, ఎస్‌డిఎఫ్ నిధులు రూ. 90 లక్షలు మంజూరు చేశారు. అప్పటి రాష్ట్ర ఇంధన శాఖ మంత్రిగా ఉన్న కిమిడి కళా వెంకటరావు నూతన తహశీల్దార్ కార్యాలయానికి శిలాఫలకం వేశారు. పనులు పూర్తి చేసేందుకు టెండర్లు ప్రక్రియ కూడా పూర్తయింది. 9 నెలల్లో పనులు పూర్తి చేసి అన్ని రంగులతో అందించాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు జిల్లా కలెక్టర్ అప్పట్లో ఆదేశాలు జారీ చేశారు. అప్పటి పాలకొండ ఆర్‌డిఒ రెడ్డి గున్నయ్యకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఐదు నెలలు మాత్రమే పనులు స్పీడ్‌గా జరిగిన తరువాత చతికిలపడ్డాయి. స్లాబ్ వరకు పూర్తి చేశారు.


శిథిలావస్థకు చేరిన పాత తహశీల్దార్ కార్యాలయం

నిధులు విడుదల కాక..

కార్యాలయ నిర్మాణానికి వెచ్చించిన ఎస్‌డిఎఫ్ నిధులు విడుదల కాకపోవటంతో కాంట్రాక్టర్ గత ఐదేళ్లుగా ఎటువంటి పనులూ చేపట్టలేదు. నూతన తహశీల్దార్ కార్యాలయం నేటి వరకు పూర్తి కాకపోవటంతో శిథిలావస్థలో ఉన్న పాత తహశీల్దార్ కార్యాలయంలోనే అధికారులు, కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వర్షానికి, ఎండలకు పెచ్చులు ఊడుతూ ఎప్పుడు కూలిపోతుందోనని భయాంధ్రాంతులతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో కంప్యూటర్ గదులు, పుస్తకాలు ఉంచు గదులు, ప్రాంగణాలు తడిసిపోవటంతో గదుల్లో ఉన్న దస్త్రాలు తడిసి ముద్దవుతున్నాయి. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో నూతన తహశీల్దార్ కార్యాలయం పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దృష్టిసారించి నూతన తహశీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులు పూర్తి చేయించి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

పనులు పూర్తికాకుండానే ఫర్నీచర్

వాస్తవానికి తహశీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులు పూర్తికాలేదు. కానీ ఇప్పటికే అందులో వినియోగించాల్సిన బెంచీలు, కుర్చీలు, కంప్యూటర్లకు మాత్రం కొనుగోలు చేశారు. వీటిని కొనుగోలు చేయడానికి కూడా రూ. లక్షలు ఖర్చుపెట్టినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు పూర్తి కాకముందు ఇలా ప్రజా ధనాన్ని వృథా చేసి ఫర్నీచర్ కొనుగోలు చేయడం పట్ల పలువురు మండిపడుతున్నారు. అయితే నూతన భవనం ఎప్పట్లో పూర్తి కాదని భావించిన అధికారులు ఈ ఫర్నీచర్‌ను పాత భవనంలో పెట్టి వినియోగించుకుంటున్నట్లు తెలిస్తోంది.


మధ్యలో నిలిచిపోయిన నూతన కార్యాలయ భవనం

బిల్లులు చెల్లించలేకనే నిర్మాణం పూర్తి కాలేదు

రేగిడి తహశీల్దార్ కార్యాలయానికి నిర్మాణ పనులలో భాగంగా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేక నిర్మాణం పూర్తి కాలేదు. నిర్మాణ పనులకు రూ.90 లక్షల ప్రతిపాదనలు చేశాం. రూ.67 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందులో ఇంతవరకు రూ. 28 లక్షలు మాత్రమే బిల్లు చెల్లించాం. మిగతా రూ.39 లక్షలు కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సి ఉంది. అయినా కాంట్రాక్టర్ ముందుకు వచ్చి పనులు చేశారు. బిల్లులు వచ్చాకే మిగతా పనులు పూర్తి చేస్తాం.

నాగభూషణరావు, ఆర్‌అండ్‌బి జెఇ, రాజాం.


ముందస్తు ఎన్నికలకు వెళ్లం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -భోగాపురం

ముందస్తు ఎన్నికలకు ప్రభుత్వం వెళ్లే అవకాశం లేదని, ముందస్తు ఎన్నికలకు ప్రతిపక్షాలు కావాలనే ప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలో 3వ విడత వైస్సార్ ఆసరా సంబరాలు కార్యక్రమంలో భాగంగా మండలంలో ఉన్న 1055 సంఘాలకు సుమారు రూ 7.17 కోట్ల చెక్‌ను ఆయన డ్వాక్రా మహిళలకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి సువర్ణ పరిపాలన అందిస్తున్న జగన్మోహన్ రెడ్డికి మరలా అధికారాన్ని అందజేసి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుకోవాలన్నారు. పొదుపు సంఘాలకు బ్యాంకు ఋణాల మొత్తం సొమ్మును 4 దఫాలుగా మహిళలకు అందజేసి, జనవరిలో రూ.3వేలు పెన్షన్ అందజేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలు పాలాభిషేకం నిర్వహించారు.అనంతరం జగన్ననే మా భవిష్యత్తు అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైయస్సార్ కాంతి పథకం కింద విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉప్పాడ అనూష, వైస్ ఎంపిపిలు రావాడ బాబు, సత్యవతి, మండల పార్టీ కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మైలపల్లి నరసింహులు, ఎంపిడిఒ డి. బంగారయ్య, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, నాయకులు పడాల శ్రీను, భాను ప్రకాష్, సుందర హరీష్, ఎర్ర అప్పల నారాయణ, కర్రోతు శ్రీనివాసరావు, వెంకటరమణ, సర్పంచులు, ఎంపిటిసిలు, జెసిఎస్ కన్వీనర్లు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ ఆశయాలు యువతకు ఆదర్శం

సంఘ సంస్కర్త, ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు బాబూ జగ్జీవన్‌రామ్


విద్యార్థినులకు కళ్లద్దాలను అందిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



భోగాపురం: మహిళలకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ఆశయాలు భావితరాలకు ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బుధవారం జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వతంత్ర సమరయోధులుగా, రాజకీయ జ్ఞానిగా ఎంతో పేరు ప్రఖ్యాతులు ఆయన పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అనూష, మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గరివిడి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో బుధవారం మూడో విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాబోయే 2024 ఎన్నికలు పేదవాడి ఆర్థిక అభివృద్ధికి పెత్తందారి ఆలోచనలకు జరగబోయే ఎన్నికలు అని అక్కాచెల్లెమ్మలందరూ తప్పనిసరిగా జగన్మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని చెప్పారు. మండలంలోని 13,099 మంది లబ్ధిదారులకు రూ. 7.91కోట్లు చెక్కును పంపిణీ చేశారు. అనంతరం జాతీయ అందత్వ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అందత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మండలంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన చేతులు మీదుగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మీసాల విజయలక్ష్మి, జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాస నాయుడు, మాజీ ఏఎంసి చైర్మన్ మీసాల విశ్వేశ్వరావు, మాజీ ఎంపిపి కొనిసి కృష్ణంనాయుడు, వైస్ ఎంపిపిలు గుడివాడ శ్రీరాములు నాయుడు, వెంకటపతి గణపతి రాజు, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మహిళా సంఘ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పాటూరులో పురాతన శిలా శాసనం లభ్యం

వేపాడ : మండలంలోని పాటూరు గ్రామంలో గల జగన్నాథ స్వామి ఆలయం సమీపంలో పురాతన శిలాశాసనం లభ్యమైంది. ఆ గ్రామ మంచినీరు కోనేరులో ఈ శిలా శాసనం రాతి పలక లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు.


బయట పడిన శిలాశాసనం

ఈ శిలాఫలకానికి ఫొటో తీసి విశాఖపట్నంలో గల పురాతన వస్తు శాఖకు పంపించారు. ఈ శిలాఫలకం 11,12 వ శతాబ్దాలకు చెందినదిగా, తూర్పు గాంగల కాలం నాటిదని అంచనా వేసినట్లు ఆలయ అర్చకులు ప్రసాద్ తెలిపారు.

7న పార్వతీపురంలో సదస్సు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 7న పార్వతీపురంలోని గిరిజన భవనంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు పాలక రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు జిల్లాలో ఉన్న గిరిజన నాయకులంతా హాజరుకావాలని కోరారు. బోయ, వాల్మీకి, బెంతు ఒరియా కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలనే ముఖ్యమంత్రి తీర్మానాన్ని నిరసిస్తూ ప్రతీ గిరిజనుడు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గిరిజనుల హక్కులు, చట్టాల కోసం పోరాడకుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

పినతాడివాడలో భారీ అన్నదానం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పిన తాడివాడలో అయ్యప్ప స్వామి పుట్టినరోజు వేడుకలు సర్పంచ్ లంక లక్ష్మణరావు, ఎంపిటిసి విజనగిరి అచ్చంనాయుడు, గురు స్వాములు దంతులూరి వెంకట వరమరాజు, వాళ్ళ గౌరి నాయుడు, అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఉన్న అయ్యప్ప స్వామి పీఠంలో నూతన విగ్రహాన్ని ఆవిష్కరించి పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం సుమారు 2,500 మందికి అన్నదానం నిర్వహించారు. అనంతరం గ్రామంలో కలశాలతో విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాళ్ళ వెంకట్రావు, వైస్ సర్పంచ్ రేవల్ల అప్పలనాయుడు, అయ్యప్ప కమిటీ సభ్యులు, భక్తులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

పుర్రేయవలసలో భారీ అన్నదానం

గరివిడి: చీపురుపల్లి మండలంలోని పుర్రెయ వలస గ్రామంలో అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా అయ్యప్ప దీక్ష పీఠం, రెడ్డిపేట తత్వమసి ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి సన్నిదానం సంయుక్తంగా బుధవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని


గ్రామంలో కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వైసిపి నాయకులు ఇప్పిలి అనంతరం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ప్రారంభించారు. ముందుగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రామలింగపురం సర్పంచ్ ఇప్పిలి రాము, క్లాసిక్ రమణ, కెల్లా గోపి, కంది దుర్గారావు, సత్యనారాయణ, రవి, కోరాడ సూరి, కంది సత్యం, మొండేటి కిషోర్, అయ్యప్ప స్వామి భక్తులు ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

ప్రజాశక్తి- బొబ్బిలి

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె. విజయగౌరి అన్నారు. బొబ్బిలిలో జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా జరిగింది. ఆర్ అండ్ బి బంగ్లా సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన పని చేశారని నేతలు కొనియాడారు. కార్యక్రమంలో దళిత ఉద్యోగుల సంఘం నాయకులు పి.అప్పయ్య, ఎపిఇపిడిసిఎల్ సిజిఎం ఎస్.మశిలామణి, ఎస్ఐబి సిఐ ఆర్.జైభీమ్, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో నీలకంఠరాజుపురం, బల్లంకి వల్లంపూడి, గ్రామాలలో ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు బుధవారం జరిగాయి. నీలకంఠరాజపురం ఎస్‌సి కాలనీ వద్దగల



బొబ్బిలి: విగ్రహానికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే

జగ్జీవన్ రామ్ విగ్రహానికి డిసిసిబి చైర్మన్ వి.వి.చిన్నరామునాయుడు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ మూకలు కస్తూరి, స్థానిక సర్పంచ్ గొటివాడ దేవి, దళిత సేవా సేన అధ్యక్షుడు కొమనపల్లి రవి ప్రసాద్, దళిత మహాసభ మండల అధ్యక్షులు కోమనపల్లి రాము, నియోజకవర్గ టిడిపి యువనేత గొంప కృష్ణ, టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు, గుమ్మడి భారతి తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి పనులను వివరించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ప్రతి ఇంటికీ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను, అందజేస్తున్న సంక్షేమ పథకాలను గృహసారథులు, కార్యకర్తలు, నాయకులు వివరించాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని వెంకటరమణపేట, ఎస్.కోట 1, 2 సచివాలయాల పరిధిలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమానికి సంబంధించిన కిట్లు పంపిణీతో పాటు గృహసారథులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్నే మా భవిష్యత్తు గోడ పత్రికలను ఎమ్మెల్యే, ఎంపిపి ఎస్.సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు ఇందుకూరి సుధారాజు, పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు,


మెరకముడిదాం: కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

మండల పార్టీ ప్రెసిడెంట్ మోపాడ కుమార్, జెసిఎస్ మండల ఇంఛార్జి కె.వెంకటరావు, పోతనపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : మండలంలోని జమ్మాదేవిపేట, కితన్నపేట, గొల్జాం, మార్లాపల్లి, లచ్చింపేట, పోతంపేట, చందులూరు తదితర గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జగనన్నే మా భవిష్యత్తుకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. గొల్జాంలో ఎమ్మెల్యే పాల్గొన్న కార్యక్రమంలో సర్పంచ్ తూర్పాటి సంతోషమ్మ, అదే గ్రామానికి చెందిన జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి పాల్గొనలేదు. 30 మంది గృహ సారదులకు గాను ఆరుగురే హాజరవ్వడం పట్ల పార్టీ నాయకుల్లో చర్చ జరిగింది. ఇదే విషయంపై సర్పంచ్ సంతోషమ్మ భర్త వైసిపి సీనియర్ నాయకులు తూర్పాటి వెంకటరామకృష్ణ వద్ద ప్రస్తావించగా తమకు ఎటువంటి సమాచారమూ లేదన్నారు ఈ కార్యక్రమంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, జెసిఎస్ కన్వీనర్ యడ్ల కిషోర్ కుమార్, స్థానిక నాయకులు జగ్గన్నదొర, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: మండలంలోని గర్భాం, చెల్లాపురం, బైరిపురం పంచాయతీల్లో బుధవారం 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి చెందిన కిట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎస్‌వి రమణ రాజ, తాడ్డి వేణుగోపాలరావు, కెఎస్‌ఆర్కే ప్రసాద్, కోట్ల వెంకటరావు, బూర్లె నరేష్ కుమార్, గ్రామ సర్పంచ్ పప్పల విజయ కుమారి పాల్గొన్నారు.

రామభద్రపురం: జగనన్న సుపరిపాలనే రాష్ట్ర ప్రజల భవిష్యత్ అని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని రొంపల్లి,


లక్కవరపుకోట: గృహ సారధులకు కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

తారాపురం సచివాలయాల్లో కన్వీనర్లు గృహ సారధులతో వాలంటీర్లను సమన్వయం చేసే సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతమ్మ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు, పువ్వల నారాయణరావు పాల్గొన్నారు.

మేడపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

- వచ్చే నెలలో కుమార్తె వివాహం
- ఇంతలోనే తండ్రి దుర్మరణం

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడ గ్రామానికి చెందిన మండల ఆనంద్ (55) ఇంటి మేడపై నుంచి జారిపడి మృతి చెందాడు. ఆంద్ర ఎస్ఐ సిద్దార్థ్ కుమార్ అందించిన వివరాలు ప్రకారం.. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో ఆనంద్ మేడపైకి వెళుతున్న క్రమంలో జారిపడ్డారు. తలకు బలమైన గాయం కావడంతో 108 వాహనం ద్వారా గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. పోస్ట్ మార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వచ్చే నెలలో కుమార్తె వివాహం

ఆనంద్ కుమార్తెకు మే నెలలో వివాహం నిశ్చయమైంది. ఇప్పటికే పెళ్లి పనులు కూడా ప్రారంభించారు. ఇటీవల పెళ్లి చూపులు ఘనంగా జరిపారు. కుటుంబ యజమాని అకాల మరణంతో పెళ్లింట విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆనంద్‌కు భార్య, కుమారుడు కుమార్తె వున్నారు.